
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
సోమవారం, 27 జనవరి 2025



ముగిసిన మునిసిపల్ పాలన

ఇల్లెందు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మునిసిపాలిటీ పాలవకర్గం పదవీకాలం ముగిసింది. 2020లో జరిగిన ఎన్నికల్లో చైర్మన్ దమ్మాలపాటి వెంటేశ్వరరావు నాయకత్వంలో ఏర్పడిన పాలకవర్గం పదవీకాలం అనేక సంచలనాలతో ముగిసింది. మునిసిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 19, ఎన్డీ 1, బీఆర్ఎస్ అభ్యర్థిగా డీవీ, వైస్ చైర్మన్‌గా జానీపాషా ఎన్నికయ్యారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో చైర్మన్, వైస్‌చైర్మన్లు మరికొందరు కౌన్సిల్ కాంగ్రెస్‌లో చేరడంతో పాలన కాలం ము గిసే నాటికి కాంగ్రెస్ గుప్పిట్లోకి మునిసిపల్ చేరింది. ఇల్లెందు మునిసిపాలిటీ రాష్ట్రస్థాయి అవార్డులు గెలుచుకుని రాష్ట్రంలోని మునిసిపాలిటీలకు మార్గదర్శిగా నిలిచింది.

మాది సంక్షేమ సర్కార్

- బీఆర్ఎస్‌లా మాయమాటలు చెప్పం
- సాగు భూములకు షరతులు లేకుండా రైతు భరోసా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం: ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి
- రిపబ్లిక్ డే సందర్భంగా నాలుగు 'సంక్షేమ' పథకాలు ప్రారంభం
- లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందించిన మంత్రులు



కొణిజర్లలో ఇందిరమ్మ ఇంటి పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొణిజర్ల/ముదిగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ఆదివారం గణతంత్ర దినోత్సవం రోజున ప్రారంభించారు. తొలి రోజు ప్రతి మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామంలో ఆయా పథకాలను లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందించారు. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్ని లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందించారు.

మేం మాయమాటలు చెప్పం.. డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేకనే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పదేళ్లలో ఒక్క పేదవాడికి రేషన్ కార్డు ఇవ్వలేదని, రైతులకు ఒక్క లక్ష కూడా రుణమాఫీ చేయలేకపోయిందని విమర్శించారు. కొణిజర్ల మండలం చిన్న గోపతి గ్రామంలో ఆదివారం నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పవిత్రమైన జనవరి 26 రోజున నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ పథకాలపై కొన్ని పార్టీలు చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. పథకాల అమలు అనేది ఒక్క రోజుతో ముగించే ప్రక్రియ కాదని, అది నిరంతరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ నాలుగు పథకాలకు ఏడాదికి రూ.45వేల కోట్ల ఖర్చు వస్తుందని, భారమైనా ప్రజల కోసం తల తాకట్టు పెట్టయినా ఈ పథకాలను అమలు చేస్తామన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలను అన్ని రకాలుగా మోసం చేశారన్నారు. కనీసం పేదలకు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. గత ప్రభుత్వం వలే తమది మాయమాటలు చెప్పే ప్రభుత్వం కాదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు కొన్ని పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మకుండా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ షరతులు లేకుండా రైతుభరోసా అందిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. ఇప్పటికే రైతుల అకౌంట్లలో నగదు జమ అయ్యాయని, శాంక్షన్ లెటర్ తీసుకున్న రైతులు సోమవారం బ్యాంకులకు వెళ్లి నగదు తెచ్చుకోవచ్చని తెలిపారు. ప్రపంచం పోటీపడేలా రూ.200కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు త్వరలో టెండర్లు పిలవబోతున్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు హాస్టల్ పిల్లలు ఏమి తింటున్నారో కూడా బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హాస్టల్‌కు డైట్ చార్జీలను 40శాతం పెంచామన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, ఆర్డీవో నరసింహారావు, డీఎల్‌పీవో రాంబాబు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజల ప్రభుత్వం: మంత్రి తుమ్మల

తమది ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని తెలిపారు. రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, తెల్లరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి తుమ్మల అర్హత పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘునాథపాలెం మండలాన్ని ఆదర్శ మండలంగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం ఈ మండలంలో అనేక విద్యాసంస్థలు నెలకొల్పుతున్నామన్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి మంచుకొండ లిఫ్ట మంజూరు (మిగతా 4వ పేజీలో)



రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో ఇందిరమ్మ ఇంటి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి తుమ్మల



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి వెంకటరెడ్డి



ప్రగతిపథంలో విద్య, వైద్యం

- నిరుపేదలకు సంక్షేమ ఫలాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- 'సీతారామ'తో జిల్లా ఆయకట్టుకు గోదావరి జలాలు
- 'సాగు సాయం'తో రైతులకు భరోసా కల్పిస్తున్నాం
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత

ఖమ్మం జనవరి 26 (ఖమ్మం ఆంధ్రజ్యోతిప్రతినిధి): విద్య, వైద్య రంగాల్లో జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలు నిరుపేదలకు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికి అనుగుణంగానే జనవరి 26 నుంచి జిల్లా వ్యాప్తంగా నాలుగు కొత్త పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో జిల్లా సమగ్రాభివృద్ధికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభిస్తున్నామన్నారు. పూర్తి పారదర్శకతతో గ్రామసభల్లో ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి అమలు చేస్తున్నామన్నారు. అర్హుల ఎంపిక నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దన్నారు. కలెక్టర్ తన ప్రసంగంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను నివేదిక రూపంలో అందించారు.

రైతుల కోసం తొలి ఏడాది ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు నేస్తం, వరి పంటకు బోనస్, ఆయిల్ పామ్ పంట విస్తరణకు ప్రోత్సాహకాలు వంటి అనేక అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. జిల్లాలో వ్యవసాయ యోగ్యమైన ప్రతిఎకరాలకు సాగు సాయం అందిస్తాన్నారు. జిల్లాలో ఒక లక్షా 31,723మంది రైతులకు రూ908 కోట్ల 76 లక్షల మేర రుణమాఫీ చేసినట్లు వివరించారు. జిల్లాలో 42,461మంది రైతుల నుంచి 24లక్షల 41వేల క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి రూ.122కోట్ల 5లక్షలు బోనస్‌గా చెల్లించామన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా జిల్లాలో (మిగతా 6వ పేజీలో)

పథకాల కోసం ఫైట్

- అర్హత పత్రాల పంపిణీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల బాహాబాహి
- బీఆర్ఎస్ కార్యకర్త తలకు తీవ్రగాయాలు
- బెండాలపాడులో ఘటన

చంద్రుగొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నాలుగు సంక్షేమపథకాల లబ్ధిదారులకు అర్హత పత్రాల పంపిణీలో బీఆర్ఎస్, కార్యకర్తలు బాహాబాహికి దిగారు. చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో ఆదివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో బీఆర్ఎస్ కార్యకర్త తలకు తీవ్ర గాయాలయ్యాయి. బెండాలపాడులో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఉన్న అధికారుల వద్దకు బీఆర్ఎస్ మండల నాయకుడు మేడా మోహన్‌రావు తమ పార్టీ కార్యకర్తలతో వచ్చి సంక్షేమ పథకాలు అందరికీ అందలేదని అధికారులను ప్రశ్నించారు. దాంతో కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జోక్యం చేసుకొని తమ ఊరి వ్యవహారాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ కొట్లాటకు దారితీసింది. ఈ కొట్లాటలో బీఆర్ఎస్ కార్యకర్త రవి తల పగిలింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు బెండాపాడుకు చేరుకొని దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయితీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అశ్వారావుపేట ఎస్ఐ శివరామకృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకొని బీఆర్ఎస్ నాయకులకు సర్ది చెప్పారు.

ఇల వైకుంఠం

- భద్రాద్రిలో వైభవంగా విశ్వరూప సేవ
- కనులపండువగా సర్వదేవతా అలంకరణ



భద్రాచలం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాద్రిలో ఆదివారం నిర్వహించిన సర్వదేవతాలంకారంను భక్తులు కన్నులపండువగా తిలకించారు. అంతా రామమయం..ఈ జగమంతా రామమయంఅంటూ దేవస్థానం హరిదాసులు కీర్తనలను ఆలపిస్తుండగా తన్మయత్వంతో భక్తులు రామనామస్మరణ చేయడంతో ఆ ప్రాంతమంతా పులకించింది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం సకల దేవతా అలంకారం (విశ్వరూపసేవ) వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళద్వాదశి రోజు ఉత్సవమూర్తులను ఒకేచోట చేర్చి ఆరాధాన నిర్వహించడం భద్రాద్రి దేవస్థానంలో ప్రత్యేకత. ఈ సమయంలో ఆలయంలోని 108 దేవతామూర్తులను ఒకే చోటకు చేర్చి ప్రత్యేక అలంకరణ చేయడంతో భద్రాద్రి కలియుగ వైకుంఠమైంది. గరుడ వాహనంపై శ్రీసీతారాములు ఆసీనులు కాగా సాయంకాలం సమయంలో ఆలయ సన్నిధిలో ఇతర ఉత్సవమూర్తులకు ఆరాధాన నిర్వహించి 'కదంబం' అనే ప్రత్యేక ప్రసాదాన్ని నివేదన చేశారు. భద్రాద్రి దేవస్థానంలో తప్ప మరెక్కడా విశ్వరూపసేవ నిర్వహించడం లేదు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, ప్రోటోకాల్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో దామోదర్‌రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్య, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ సమయంలో గణతంత్ర వేడుకల్లో భద్రాద్రి దేవస్థానం తరపున ప్రశంసాపత్రాలు అందుకున్న వైదిక, పరిపాలన సిబ్బందిని ఈవో అభినందించారు.



నవభారత్‌లోని నవనగర్ కాలనీ

ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

ఘరానా చోరీ

- ఒకే సమయంలో పది క్వార్టర్లలో దొంగతనం
- పాల్వంచ నవభారత్ ప్రాంతంలోని నవనగర్‌లో ఘటన
- సుమారు 60 తులాల బంగారం, రూ.10లక్షల అపహరణ
- విచారణ చేపట్టిన పోలీసులు
- చోరీ ప్రాంతాన్ని పరిశీలించిన పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఒకేసారి పది క్వార్టర్లలో చోరీ జరిగింది. సుమారు 60 తులాల బంగారం, రూ.10లక్షల నగదును దొంగలు అపహరించుకుపోయారు. పాల్వంచ పట్టణం నవభారత్ ప్రాంతంలో 24 గంటలు హైసెక్యూరిటీ పర్యవేక్షణలో ఉండే నవనగర్ కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన పాల్వంచ వాసులను భయభ్రాంతులకు గురి చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. నవ లిమిటెడ్ కంపెనీలో పని చేసే ఉద్యోగుల కోసం సంస్థ వారు నవనగర్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలనీలో సుమారు 240 క్వార్టర్లలో వివిధ హోదాల్లో పనిచేసే వారు నివాసముంటున్నారు. ఇందులోని జాస్మిన్, రెడ్‌రోజ్, లెమన్‌ట్రీ బ్లాకుల్లోని 10క్వార్టర్లలో శనివారం అర్ధరాత్రి దొంగలు తాళాలు వేసి ఉన్న 10క్వార్టర్ల తాళాలను పగులగొట్టారు. ఇళ్లలోకి ప్రవేశించి బీరువాలను, అల్మారాలను పగులగొట్టి వాటిలోని బంగారం వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఇళ్లల్లోని వస్తువులను చిందరవందరగా (మిగతా 4వ పేజీలో)

కేఎంసీ కార్మికులకు రూ.5లక్షల బీమా

- బీమా పత్రాలు అందించిన మేయర్, కమిషనర్
- కేఎంసీలో జెండా ఆవిష్కరించిన కమిషనర్

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలకంలో పనిచేస్తున్న కార్మికులందరికీ రూ.5 లక్షల బీమా అమలు చేస్తున్నామని చెప్పారు. కొంతమంది కార్మికులకు బీమా పత్రాలను ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య అందజేశారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్యం, అత్యవసర సేవలకోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్లు, ఉద్యోగులు, కార్మికుల నడుమ జాతీయజెండాను కమిషనర్ ఎగురవేశారు. ఉపమేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర, ఆర్వో శ్రీనివాసరావు, ఏవో శివలింగం, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, మెప్మా డీఎంసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు కష్టానికి ఏదీ గుర్తింపు

గణతంత్ర వేడుకల సందర్భంగా ఖమ్మం నగర పాలక సంస్థలో 35 మంది ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలను మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య అందించారు. కాగా మున్నేరు వరదల సమయంలో కాల్వొడ్డు, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ వంటి ముంపు ప్రాంతాల్లో పనిచేసిన అజయ్, లక్ష్మీనారాయణ, గుమ్మడి రమేశ్, టీ కృష్ణ, కొమ్మ వెంకన్న, శేషయ్య, కుక్కల నాగరాజు, ఎండీ పాషా, శివకుమార్, తాళ్లపల్లి రాములు, దోజర్ కృష్ణ, కార్మికులకు ప్రశంసాపత్రాలు దక్కలేదు. దీంతో జెండావిష్కరణ అనంతరం కొంతమంది పారిశుధ్య కార్మికులు కేఎంసీ కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్యను నిలదీశారు. ఏ ప్రతిపాదికన ప్రశంసాపత్రాలు ఇచ్చారని ప్రశ్నించారు.




ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన సీపీ సునీల్ దత్


భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ప్రగతి మైదానంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్


జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

ఘనంగా గణతంత్ర వేడుకలు

- ఇరుజిల్లాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించిన కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి పాటిల్
- భద్రాచలం ఐటీడీఏ జెండా ఎగురవేసిన ఐటీడీఏ పీవో రాహుల్
- ప్రకాశం మైదానంలో పతాకాన్ని ఆవిష్కరించిన సింగరేణి సీఎండీ బలరాం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ జాతీయ జెండాలను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీసుల మార్చ్‌ఫాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్ జాతీయ జెండాను ఎగురవేశారు. కొత్తగూడెం ప్రకాశం మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో సింగరేణి సీఎండీ బలరాం పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఖమ్మంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించారు. ఖమ్మం అభినవ్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు 200 మీటర్ల జాతీయ జెండాతో పాఠశాల నుంచి గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


ఖమ్మం పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు


200 మీటర్ల జాతీయ జెండాతో ఖమ్మం అభినవ్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన


సింగరేణి ప్రకాశం మైదానంలో సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎండీ బలరాం


ఖమ్మంలో స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్




ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో...


సింగరేణి ప్రకాశం మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



కొత్తగూడెం ప్రగతి మైదానంలో...

ఐదేళ్లలో రూ.125కోట్లతో సత్తుపల్లి అభివృద్ధి

- సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ మహేష్



సత్తుపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం ఐదేళ్లలో రూ.125కోట్లతో సత్తుపల్లి పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసినట్లు మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ చెప్పారు. ఆదివారంతో ఐదేళ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తన పదవీ కాలంలో పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన అప్పటి మునిసిపల్ మినిస్టర్ కేటీ.రామారావు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు మునిసిపల్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించి తనకు అండగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నిలిచారని చెప్పారు. సత్తుపల్లి మునిసిపాలిటీలో విలీన మైన రాజీవ్‌నగర్‌లో బస్తీ ద వాఖానా ఏర్పాటుచేసి రూ.3.20కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టామన్నారు. అన్ని వార్డులలో రూ.35.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించామని, ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.4.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గతంలో నిర్మాణం నిలిచిపోయిన మునిసిపల్ ఆఫీస్ భవనం అత్యాధునిక వసతులతో రూ.3.15కోట్లతో నిర్మించి ప్రారంభిపజేసినట్లు చెప్పారు. మునిసిపల్ ప్రాంగణంలో రూ.12లక్షల వ్యయంతో జాతీయ జెండాను ఏర్పాటు, మన జాతీయ చిహ్నం నాలుగు సింహాల బొమ్మలు రూ.9లక్షలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంబేద్కర్ సర్కిల్‌ను రూ.34లక్షల వ్యయంతో ఆధునీకరించి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. వేం సూర్ రోడ్డులో షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్లు, అంబేద్కర్ ఆడిటోరియానికి రూ.2.65 కోట్లు, ఆధునిక దోబీఘాట్ నిర్మాణానికి రూ.2.70కోట్లు, వివేకానంద సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవన నిర్మాణం కోసం రూ.30లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

సండ్ర వెంకటవీరయ్య కృషితో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు చేశారని, నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. సత్తుపల్లికి నర్సింగ్ కళాశాలను సండ్ర వెంకటవీరయ్య మంజూరు చేయించారని తెలిపారు. 350ఎకరాలలో అర్బన్ పార్క్ నిర్మాణం చేశామని, వేశ్యకాంతల చెరువు ఆధునీకరణకు రూ.3కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సత్తుపల్లి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించిన పట్టణ ప్రజలు, పాలకవర్గ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇల్లెందు పట్టణంలో రూ.107కోట్లతో అభివృద్ధి

- ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు



ఇల్లెందు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకనాడు దుర్గంధం.. కాలుష్యంతో కూడిన ఇల్లెందు పట్టణం నేడు విశాలమైన బీటీ రోడ్లు, గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్‌లతో రాష్ట్ర జాతీయస్థాయిల్లో అవార్డులు సాధిస్తూ జిల్లాకు వన్నె తెచ్చింది. తొలిసారి రాజకీయాల్లో ప్రవేశించి మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికైన దమ్మాలపాటి వెంకటేశ్వరరావు విజయవంతంగా ఈ నెల 26కు తన ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటున్నారు. తన పదవి కాలంలో పట్టణాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ హరితహారం అవార్డు, కేంద్ర ప్రభుత్వం ఓడీఎఫ్, ప్లస్.. ప్లస్ అవార్డు రెండు పర్యాయాలు శానిటేషన్, హరితహారాం, పీపీఐటీ విభాగాల్లో ఇల్లెందు మునిసిపాలిటీకి అవార్డులు సాధించిన ఖ్యాతి గడించారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి : ఐదేళ్ల పదవీకాలం ఎలా అనిపించింది..?

డీవీ : విద్యా సంస్థ నిర్వాహకుడిగా ఉన్న తనను ప్రజలు ఆశీర్వదించి చైర్మన్‌ను చేశారు. కరోనా కాలంలో 28మంది అంత్యక్రియలు జరిపించిన ఆత్మసంతృప్తి చెప్పలేనిది. గ్రేడ్ 3 మునిసిపాలిటీగా ఉన్న ఇల్లెందు పట్టణంలో మునిసిపల్ ఆదాయ వనరులు పెంచడానికి ప్రాధాన్యత నిచ్చి ఆర్థిక పరిపుష్టి కలిగించాను.

ఆంధ్రజ్యోతి : మీ పాలనలో చేసిన ప్రాధాన్య పథకాలు ఏమిటి..?

డీవీ : ఐదేళ్ల కాలంలో 107 కోట్ల అభివృద్ధి పనులు చేయించాను. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల కోసం వివిధ సంస్థల నుంచి అన్యాక్రాంతమైన స్థలాలు దాదాపు రూ.50 కోట్ల విలువైన 44 ఎకరాల భూమిని సేకరించి వినియోగంలోకి తెచ్చాను. సెంట్రల్ లైటింగ్స్,స్విమ్మింగ్ పూల్, మార్కెట్ కాంప్లెక్స్, వెండర్స్ జోన్, కేంద్ర గ్రంథాలయం లాంటి శాశ్వత పథకాలు అమలు చేశాను. జీవో నెం. 76 ద్వారా 2,600మంది పట్టణ పేదల నివాస గృహాలకు క్రమబద్ధీకరణ పట్టాలు జారీ చేయించాను. జిల్లాలో ప్రథమంగా మలవ్యర్థాలను శుద్ధీకరించే కేంద్రాన్ని నెలకొల్పాను.

ఆంధ్రజ్యోతి : ఆదాయ వనరుల పెంపుదలకు ఏ చర్యలు చేపట్టారు..?

డీవీ : గతంలో మునిసిపల్ సిబ్బంది వేతనాలు ప్రతి నెల సక్రమంగా చెల్లించే పరిస్థితి లేదు. ఇప్పుడు వారికి ప్రతి నెల వేతనాలు అందించగలుగుతున్నాను. శానిటరీ సిబ్బందికి, రిక్షాపుల్లర్లకు వేతనాలు పెంచడం జరిగింది. ప్రతి కార్మికుడికి గ్రూప్ ఇన్సురెన్స్ రూ.5లక్షలు ప్రమాదబీమా పథకాన్ని అమలు చేయించడం జరిగింది. మోడల్‌మార్కెట్లో 192, షాపింగ్ కాంప్లెక్స్‌లో 32, వెండర్‌జోన్‌లో 82 షాపులు నిర్మించడం జరిగింది. వీటికి ప్రతి నెల అద్దెల రూపంలో మునిసిపాలిటీ ఆదాయాన్ని పెంచడానికి కృషి చేశారు.

మాది సంక్షేమ సర్కార్

(3వ పేజీ తరువాయి)

చేశామన్నారు. సీతారామ ప్రాజెక్టుతో పాటు అన్ని సమస్యలు పరిష్కరించి రైతులకు మేలు చేయాలన్నదే ఈ ప్రభుత్వ ఆశయమన్నారు. రఘునాథపాలెం మండలంలో ఆయిల్‌పామ్‌ను అధికంగా సాగుచేయాలని, భవిష్యత్తులో ఆయా కుటుంబాలకు అది బంగారు పంటగా భరోసా ఇస్తుందన్నారు. గతంలో పాలేరు ఎమ్మెల్యేగా మంత్రిగా ఆ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఎలా ముందుంచానో ఇప్పుడు ఖమ్మం నియోజకవర్గాన్ని కూడా అలాగే ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా కుంగదీసినా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకోసం ఎప్పుడు దరఖాస్తు చేసినా అర్హులకు లబ్ది చేకూర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యమన్నారు. కొంతమంది తప్పుడు ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారికి ప్రజలు తగిన బుద్ది చెప్పాలన్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల కృషితో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న నాలుగు పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, సీపీ సునీల్‌దత్, జడ్పీ సీఈవో దీక్షారైనా, డిప్యూటీ సీఈవో నాగపద్మ, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఎస్వో చందన్‌కుమార్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు బండి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందాలనేదే ప్రభుత్వ లక్ష్యం: కోమటిరెడ్డి

పేదలకు ప్రభుత్వ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ముదిగొండ మండలం ఖానాపురం గ్రామంలో ఆయన లబ్ధిదారులకు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని క్రమపద్ధతిలో అమలుచేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించి పేదలకు రేషన్‌కార్డులు, ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత 13నెలల నుంచే ప్రజలు కొంత సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు త్వరలో పూర్తవుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరానికే కొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ప్రజలు అలాంటి వారి మాటలు పట్టించుకోవద్దని, మిగిలిన నాలుగు సంవత్సరాల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో ఆశాలత, స్పెషలాఫీసర్ విజయలక్ష్మీ, తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో కిషోర్, ఏవో వేణు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్, మందరపు నాగేశ్వరరావు, ఉసికల రమేష్, పసుపులేటి దుర్గా, ఉష పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

ఏపీ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

మధిర రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరుపేట గ్రామంలో టీడీపీ గ్రామకమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఘనంగా ఆవిష్కరించారు. ఏపీలోని దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. చింతమనేని రాకను పురస్కరించుకొని మధిర నుంచి మాటూరుపేట వరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. దేశంలోనే పేదలకు ఎవరూ ప్రవేశపెట్టని విధంగా ఎన్టీఆర్ పెద్ద ఎత్తున పథకాలను తీసుకువచ్చారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు పొగాకు జయరామ్‌చంద్ర, ఖమ్మం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, నాయకులు చేకూరి శేఖర్‌బాబు, మల్లాది హన్మంతరావు, వేమూరి సునీల్, యలమంచిలి శివ, మాదల రాంబాబు, మాదల రామారావు, రవి, ఉప్పసాని శివ, చెరుకూరి కృష్ణారావు, మన్నేపల్లి ప్రవీణ్, గడ్డం రమేష్, మేడా వెంకటేశ్వరరావు, చిలివేరు బుచ్చిరామ్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

తల్లాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ఆదివారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. వారంరోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని, స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ఘరానా చోరీ

(3వ పేజీ తరువాయి)

పడేసిన దొంగలు వెండి వస్తువులను కూడా అక్కడే వదిలి వెళ్లడం గమనార్హం. దొంగతనానికి ఆధునిక పరికరాలను వినియోగించారని, అందుకే ఎవ్వరికీ శబ్దాలు వినిపించలేదని కాలనీవాసులు తెలిపారు. ఉదయం ఓ ఫ్లాట్ తాళాలు పగులగొట్టి బయట పడవేసి ఉండటాన్ని గమనించిన కాలనీ వాసులు పోలీసులకు, సంస్థ సెక్యూరిటీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ ఎనాలసిస్ వింగ్ అధికారులు విచారణ చేపట్టారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఇళ్ల యజమానులు వ్యక్తిగత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వారందరూ వచ్చి, పరిశీలించి, నిర్ధారణ చేసుకుని, ఫిర్యాదు చేసిన తరువాతనే ఎంత సొత్తు అపహరణకు గురైందనే విషయంలో పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంటుందని పాల్వంచ సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

నేరుగా వెదజల్లే పద్ధతిలో వరి సాగు


విత్తనాలు వెదజల్లుతున్న కూలీలు

వైరా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం నల్లచెరువు ఆయకట్టు పరిధిలోని రైతులు నేరుగా వెదజల్లే విధానంలో ముమ్మరంగా వరిసాగు చేస్తున్నారు. రబీలో ఒకరిద్దరు రైతులు మాత్రమే వరినాట్లు వేసేందుకు మొగ్గుచూపుతున్నారు. 90శాతం మందికిపైగా ఆయకట్టు రైతులు నేరుగా వెదజల్లే విధానంలోనే వరిసాగులో నిమగ్నమయ్యారు. సంక్రాంతి, భోగి పండుగలు అయినప్పటికీ రైతులు ఈ పండుగలతో నిమిత్తం లేకుండా వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమయ్యారు. వారం పదిరోజుల్లో ఈ ఆయకట్టు కింద వరిసాగు పూర్తవుతుందని రైతులు చెపుతున్నారు.

మొక్క కట్టి వెదజల్లుతున్నాం

గొల్లపూడి రాంబాబు, రైతు, సోమవరం



ఎకరాకు 15కిలోల విత్తనాలను నేరుగా వెదజల్లుతున్నాం. 24గంటలు విత్తనాలను నానబెట్టి మరో 24గంటలు మొలక కట్టి మొత్తం 48గంటల తర్వాత దమ్ము చేసిన భూముల్లో వెదజల్లుతున్నాం. ఖరీఫ్‌లో కూడా నేరుగా వెదజల్లే విధానంలోనే వరిసాగుచేశాము. అయినప్పటికీ ఆశించిన దిగుబడులు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు రబీలో కూడా ఇదే విధానంలో వరిసాగు చేస్తున్నాం. దీనివలన కూలీల ఖర్చు ఇతర పనులు తగ్గి కొంత ఆదా అవుతుంది.


దమ్ముచేస్తున్న ట్రాక్టర్

కాసాని కాదు.. కమ్యూనిస్టు అయిలయ్య

- సంతాప సభలో బి.వెంకట్, జూలకంటి
- ఘన నివాళులు అర్పించిన అగ్రనాయకులు
- సంతాప సభలో పలువురు వక్తల ప్రగాఢ సంతాపం
- అశేష జనవాహిని మధ్య అంతిమ వీడ్కోలు
- మెడికల్ కళాశాలకు పార్థీవ దేహం అప్పగింత

సుజాతనగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'కాసాని' కాదు 'కమ్యూనిస్టు అయిలయ్య' అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం సుజాతనగర్ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఉంచిన కాసాని ఐలయ్య (75) పార్థీవ దేహనికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అగ్రనాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులులు అర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాసాని సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా బి.వెంకట్, జూలకంటి మాట్లాడుతూ.. చరిత్రలో నిలిచిపోయే నాయకులలో కొద్ది మందికే స్థానం లభిస్తుందని, అందులో కాసాని ఒకరని అన్నారు. ఆయన మరణం ఈ ప్రాంత ప్రజలకే కాదు పార్టీకి తీరని లోటు అని అన్నారు. 50 సంవత్సరాలలో అనేక ఉద్యమాలు చేశారని, ఆ కాలంలోని నేటి యువతకు ఆయన ఆదర్శప్రాయుడని, తన జీవిత కాలం ప్రజా పోరాటాలకు త్యాగం చేసి, నేడు తాను చనిపోయినా తన పార్థివ దేహన్ని ఏదో విధంగా ఉపయోగపడాలని మెడికల్ కళాశాలకు ఇవ్వడం కూడా అతి పెద్ద త్యాగమని, ఇటువంటి నాయకులు నేటి సమాజానికి చాలా అవసరం అని, నేటి రాజకీయ నాయకులు ఈయనను చూసి స్ఫూర్తి పొందాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ... నేటి తరం నాయకులు వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఇళ్ల స్థలాలు, పోడు భూముల పోరాటాలలో ఎనిమిది వేల ఎకరాల భూమిని పేదలకు పంచారని అన్నారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సాయిబాబా మాట్లాడుతూ.. నేటి తరంలో ఇలాంటి నాయకులు అరుదుగా కనిపిస్తారని, తన కోసం కాకుండా జీవితాంతం జనాల కోసం బతికిన ఒకే ఒక వ్యక్తి కాసాని అన్నారు. అనేక ఆరోగ్య సమస్యలతో సతమవుతున్నా గుండె ధైర్యంతో పోరాడారని, తన మరణం కూడా జనాల కోసం పనిచేసే విధంగా ఉండాలని పరితపించిన వ్యక్తి ఆయనని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ... ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న విప్లవ నాయకుడు అన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్, మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేగా కాంతారావు, వనమా రాఘవ, కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని, కంచర్ల చంద్రశేఖర్, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, జేబీ శౌరి, సొసైటీ ఛైర్మన్ మండే వీర హనుమంతరావు, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యన్నారాయణ, ఏజే రమేష్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, కొండపల్లి పవన్, వీర్ల రమేష్, లిక్కి బాలరాజు, వీరన్న, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య, గొర్రెల మేకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉడుత రవీందర్ తదితరులు ఉన్నారు. కాసాని పార్థీవ దేహన్ని మెడికల్ కాలేజీకి తరలించారు.


సంతాప సభలో మాట్లాడుతున్న జూలకంటి

నివాళులర్పించిన తమ్మినేని

కాసాని అయిలయ్య పార్థీవ దేహనికి శనివారం రాత్రి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నివాళులు అర్పించారు. పార్థీవ దేహంపై పూలమాల, సీపీఎం జెండా ఉంచి ఘన నివాళులు అర్పించి, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, అధైర్య పడవద్దని అన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కాసాని స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని తమ్మినేని పిలుపునిచ్చారు.


నివాళులు అర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని


సంతాప సభకు తరలివచ్చిన ప్రజా సమూహం

కలకత్తా ఫిల్మ్ ఫెస్టివల్‌లో..
'అచీవర్'కు కన్సోలేషన్ బహుమతి


అచీవర్ సినిమా బృందం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కళాకారులు నిర్మించిన ఇండిపెండెంట్ సినిమా అచీవర్‌కు కలకత్తా ఫిల్మ్ ఫెస్టివల్‌లో కన్సోలేషన్ బహుమతి దక్కింది. దేశభక్తి ప్రధానాంశంగా అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై తల్లాడ శ్రీనివాస్, రాయల సతీష్, కళ్యాణ్ గౌడ్ లు తల్లాడ సాయికృష్ణ దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మించారు. కలత్తాలో జరుగుతున్న ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా బమతికి ఎంపికైంది. బాలలు ప్రధాన పాత్రధారులుగా నిర్మించిన ఈ చిత్రంలో ఖమ్మం నగరానికి చెందిన రాయల కపిల్, చాణక్య, విశ్వతేజ్, శోభన్, విక్కీ, శ్రీనివాస్ కసిని కోట, హనుమాద్రి శ్రీకాంత్ నటించారు.

మంచుకొండ ఎత్తిపోతల పైపులైన్ పనులను..
పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రఘునాథపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకం పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం రఘునాథపాలెం మండలం మల్లేపల్లి వద్ద పైపులైన్ పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర శ్రీజ తదితరులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులతోపాటు ఇరిగేషన్ అధికారులతో మాట్లడారు. పైపులైన్ పనులు త్వరంగా పూర్తిచేయాలని, రైతులు ఎవరు అడ్డంకులు పెట్టవద్దని, ఎక్కడైనా మిర్చి, ఇతర తోటలుంటే పైపులైన్ వేసేందుకు సహకరించాలన్నారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కి సాగునీరు అందించి మండలాన్ని సస్యశ్యామలం చేయడమే నా లక్ష్యమని తుమ్మల పేర్కొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ పాఠశాల క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా జరిగిన యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. పోటీలలో విజేతగా వైఎంసీఏ ఖమ్మం ఏ జట్టు నిలవగా బొజ్జాయిగూడెం జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు మున్సిపల్ కమిషనర్ అభిషేక్‌అగస్త్య బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్టీ ఏసీపీ సాంబరాజు, హార్వెస్ట్ పాఠశాల అధినేత రవిమారుత్, యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ బిజీ క్లెమెంట్, సెక్రెటరీ సుధాకర్ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి అంకితభావంతో కృషి

76వ గణతంత్ర వేడుకల్లో ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి భద్రాచలం ఐటీడీఏ అంకితభావంతో పని చేస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ భద్రాచలం ప్రాంతంలో ప్రాచీన సాంస్కృతి, సంప్రదాయాలతో జీవిస్తున్న గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆశయంతో విద్య, వైద్యం, ఇంజనీరింగు, వ్యవసాయం, మౌళిక వసతులు, సాగు, తాగునీరు, స్వయం ఉపాధి తదితర రంగాల్లో అన్ని విధాల అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 30,854 మంది విద్యార్థులకు 348 పాఠశాలల్లో విద్యనందిస్తున్నామని, పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరంలో ఉపకార వేతనాల ద్వారా రూ.18.68 లక్షలు అందిస్తున్నామని బెస్ట్ అవైలబుల్ పథకం కింద 166 మంది విద్యనభ్యాసిస్తున్నారన్నారు. కొండరెడ్ల అభివృద్ధి విభాగం ద్వారా గ్రామాల్లో మౌళిక వసతులకు రూ.10.14 లక్షలతో ఆర్వో ప్లాంట్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ భవనాలు 199 మంజూరు కాగా 42 పూర్తి చేశామని 115 పురోగతిలో ఉన్నాయని, 87 బీటీ రోడ్లు, 12 గురుకుల పాఠశాల భవనాలు, ఏడు గిరిజన భవనాలు నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ విభాగం ద్వారా 392 ఉప కేంద్రాలో 193 ఆయుష్మాన్, ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎనిమిది కమ్యూనిటీ, రెండు ఏరియా వైద్యశాలల ద్వారా నిరంతర వైద్యసేవలందిస్తున్నామన్నారు. అటవీహక్కుల గుర్తింపు చట్టం ద్వారా 68,916 మందికి 2,22,053 ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు అందజేశామన్నారు. స్కిల్ డవలప్‌మెంటు కింద 60 రకాల యయూనిట్లకు రూ.544.43 కోట్లు సబ్సిడీతో రుణాలు మంజూరు చేశామన్నారు. జీసీసీ ద్వారా ఐదు సొసైటీల ద్వారా 113 డీఆర్ డిపోలు, 36 సబ్ డిపోల ద్వారా గిరిజన కార్డు హోల్డర్లకు నిత్యవసర సరుకులు అందజేస్తున్నామన్నారు. వివిధ శాఖల యూనిట్ అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో రాహుల్

నక్సల్స్ ఇలాకాలో జెండా రెపరెపలు

దుమ్ముగూడెం జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు ఛత్తీస్‌గడ్ కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి మావోయిస్టు ప్రభావిత ప్రాంతం సలాతోంగ్ సీఆర్‌పీఎఫ్ క్యాంపులో సీఆర్‌పీఎఫ్ 217 బెటాలియన్ క మాండెంట్ విజయ్‌శంకర్ ఆదివారం జెండావిష్కరణ చేశారు. అ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు జనజీవన స్రవంతిలో చేరాలని పిలుపు నిచ్చారు. జన స్రవంతిలో కలిసి నూతన జీవితాన్ని ప్రారంభించాలని అన్నారు. అనంతరం గ్రామస్థులకు నీటి నిల్వ ట్యాంకులు, మిఠాయిలను పంపిణీ చేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు రవిశర్మ, సంగీత్‌కుమార్, వీరేంద్రకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

గజమాలతో అంబేద్కర్‌కు నివాళి



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహనికి కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ఆదివారం గజమాల వేసి నివాళ్లు అర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల ఐక్యతకు నిదర్శనంగా క్రేన్ సహయంతో అంబేద్కర్ విగ్రహనికి గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంథోటి నాగేశ్వరరావు, మంద హనుమంతు, వెంకటేశ్వర్లు, అంకినీడు ప్రసాద్, మహేష్, సనప కోటేశ్వరరావుదొర, రవీందర్, నవతన్, మారుపాక రమేష్, నాగేశ్వరరావు, సంజీవ్‌మహరాజ్, కమలరాణి, తదితరులు పాల్గొన్నారు.

కోయభాషలో ప్రశంసా పత్రాలు

తొలిసారి ముద్రించి అందజేసిన ఐటీడీఏ

చొరవ చూపిన పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సమయాన విధుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన అధికారులు, ఉద్యోగులకు ఐటీడీఏ అందజేసే ప్రశంసా పత్రాలను ఈసారి కోయభాషలో ముద్రించారు. ఐటీడీఏ చరిత్రలోనే తొలిసారిగా కోయభాషలో ప్రశంసా పత్రాన్ని ముద్రించేందుకు పీవో బి.రాహుల్ చొరవ చూపారు. ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన తరువాత కోయభాషను నేర్చుకోవడమే కాకుండా గత ఏడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సమయాన కోయభాషలోనే ప్రసంగించి ఆదివాసీలను ఆశ్చర్య చకితుల్ని చేశారు. తాజాగా మరోసారి కోయభాషపై తన అభిమానాన్ని చాటుతూ గణతంత్ర వేడుకలకు ఇచ్చే ప్రశంసా పత్రాలను ఐటీడీఏ చరిత్రలో తొలిసారిగా కోయభాషలో ముద్రించడం విశేషం. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల సమయాన వివిధ శాఖల విభాగాల అధికారులకు కోయభాషలో ముద్రించిన ప్రశంసా పత్రాలనే వారికి ఐటీడీఏ పీవో బి.రాహుల్ అందజేశారు. కోయభాషలో ప్రశంసా పత్రాలు ముద్రించడం పట్ల ఆదివాసీ సంఘాల నాయకులు, అధికారులు పీవోను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.


ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న పీవో రాహుల్


ప్రశంసా పత్రము

76వ గణతంత్ర దినోత్సవమ్ సందర్భాతే శ్రీ/శ్రీమతి/కుమారి
ఉద్యోగం ... కార్యతలం
ఓరు 2024నె సంవత్సరంతె బాజ్జితగా ఉద్యోగ, పని తుంగాన్ దాంటే కవలర్సు కృషి తీన్ గుర్తిస్సి జారీ తుంగ్తెర్.
తలం : భద్రాచలం
బి. రాహుల్, ఐ.ఏ.ఎస్.

కోయభాషలో ముద్రించిన ప్రశంసాపత్రం

భట్టిని కలిసిన వివిధ సంఘాల నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, జనవరి26(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు ఆదివారం కలిశారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో భట్టిని కలిసి పుష్పగుచ్ఛాలిచ్చారు. నూతన కమిటీని భట్టి అభినందించారు. భట్టిని కలిసిన వారిలో వల్లపు వెంకన్న, సహాధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, జడ్.ఎస్.జైపాల్ విజయ్ కుమార్, గంగవరపు బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ యర్రా రమేష్, శ్రీధర్ సింగ్, కరణ్‌సింగ్, లలితకుమారి, జాయింట్ సెక్రటరీలు తాళ్లూరి శ్రీకాంత్, బూస చంద్రశేఖర్, ఏలూరి హరికృష్ణ కోనార్, జాయింట్ సెక్రటరీ విమెన్ శీలం రాధికా రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీ యర్రమల శ్రీనివాస్ తదితరులున్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు..

ఖమ్మంచర్చికాంపౌండ్: ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆదివారం భట్టి విక్రమార్కను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఇటీవల జరిగిన ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నికలలో అధ్యక్షుడుగా ఎన్నికైన యల్లమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాసరావు భట్టిని శాలువాలతో సత్కరించారు. వచ్చేనెలలో జరిగే నాయిబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని వారు కోరారు.

పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు..
మంత్రి తుమ్మల అభినందనలు

దమ్మపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం అభినందనలు తెలిపారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న శాసనసభ్యులు బాలకృష్ణకు, అణగారిన వర్గాల కోసం ఎమ్మార్పీఎస్ స్థాపించి వారి అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న మందకృష్ణమాదిగకు తుమ్మల అభినందనలు తెలిపారు. ఆయారంగాలలో చేస్తున్న సేవలకు కేంద్ర పురస్కారాలు దక్కటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మునిసిపల్ ప్రత్యేక అధికారిగా విద్యాచందన

కొత్తగూడెం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనను నియమిస్తూ రాష్ట్ర మున్సిపాల్ ప్రిన్సిపాల్ సెక్రటరి బాణా కిషోర్ ఆదివారం ఉత్వర్వులను జారీ చేశారు. రెండు మున్సిపాలిటీల పాలక వర్గాల కాలపరిమితి ఆదివారంతో ముగియడంతో ప్రత్యేక అధికారిని నియమించారు. సోమవారం నుంచి మున్సిపాల్ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది.

శ్రీ గోకులరామంలో..
నూతనంగా అభివృద్ధి పనులు

భద్రాచలం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీగోకుల రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్దమైంది. రూ.79 లక్షలతో ఈ పనులను చేపట్టనుండగా ఇందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఆమోదం సైతం లభించింది. శ్రీ గోకుల రామంలో ప్రస్తుతం రెండు గోశాలలుండగా ఒకటి దాత సహకారంతో నిర్మించగా, మరొకటి కెనరా బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో దేవస్థానం నిర్మించింది. తాజాగా మూడో గోశాలను రూ.19 లక్షలతో నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. అలాగే తెలంగాణకు సరిహద్దున ఉన్న జగదీష్‌కాలనీ వైపు ప్రహరీ నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించారు. ఇందుకు సంబంధించిన పనులు చేపట్టేందుకు ఇప్పటికే దేవస్థానం అధికారులు టెండర్లను ఆహ్వానించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఇందుకు సంబంధించిన పనులను చేపట్టనున్నారు.

క్రైం సమాచారం

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి



బూర్గంపాడు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ విషాద ఘటన శనివారం అర్ధరాత్రి లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బిల్లా వాసు(35) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విధులలో భాగంగా శనివారం అర్ధరాత్రి లారీని లక్ష్మీపురం గ్రామంలో గల లారీ యార్డులో నిలిపి ఉంచి క్లీనర్ పెరుమాళ్ల వెంకటేష్‌తో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మోరంపల్లిబంజర వైపు నుంచి భద్రాచలం వైపునకు వెళుతున్న కారు లారీ యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి....అదుపుతప్పి వాసును ఢీ కొట్టింది. దీంతో అక్కడిక్కడే వాసు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. క్లీనర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు విజ్ఞేష్, కుమార్తె ఉన్నారు. ఆదివారం మృతుడు అన్నయ్య బిల్లా శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కిందపడి వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టగా లారీ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం క్రాస్ రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని నాయుడుపేట పరిదిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పెంద్ర వెంకన్న (48) ద్విచక్రవాహనంపై కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం సమయంలో తన ద్విచక్రవాహనంపై వరంగల్ క్రాస్ రోడ్డువైపు వెళుతుండగా ఏదులాపురం క్రాస్ రోడ్డులో వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి వెంకన్న బండిని ఢీ కొట్టింది. వెంకన్న పై నుంచి లారీ ముందు టైర్లు వెళ్లడంతో మృతదేహం ఛిద్రమైంది. అన్నం శ్రీనివాస్ బృందం చేత మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

కూసుమంచిలో పురోహితుడు మృతి



కూసుమంచి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కూసుమంచి గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితుడు దేవులపల్లి శివరామయ్యశర్మ(92) అనార్యోగంతో ఆదివారం మృతి చెందాడు. ఇటీవల కిందపడటంతో అనారోగ్యానికి గురయ్యారు. కాగా పరిస్థితి క్షీణించడంతో ఆదివారం మృతి చెందారు. ఆరు దశాబ్దాలుగా ఈప్రాంతంలో వివాహాలు, శుభకార్యాలు చేస్తు మండల వ్యాప్తంగా సుపరిచితులుగా ఉన్నారు. ఈయన పెద్దకుమారుడు ఆంజనేయశర్మ బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా పనిచేస్తు పదవీ విరమణ చేశారు. రెండోకుమారుడు శేషగిరిశర్మ శివాలయం పూజారి. మూడోకుమారుడు రమణ సీనియర్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు.

సాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతి

కల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కల్లూరులోని సాయిబాబ దేవాలయం వీధి వైపునకు చెందిన ఇందూరి నాగాచారి(50) స్దానికంగా ఓ మోటారు షోరూంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. శనివారం సాయింత్రం నాలుగు గంటల సమయంలో మధిర బ్రాంచి కెనాల్‌పై సైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో జారి పడ్డాడు. మృతదేహం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో చంద్రుపట్ల గ్రామ సమీపాన కాల్వలో లభ్యమైంది. దీంతో చంద్రుపట్ల గ్రామస్థులు మృతదేహన్ని బయటకు తీశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంది. భార్య సుజాతతో పాటుగా ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొణిజర్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో గల బోనకల్ బ్రాంచ్ కెనాల్ కాల్వలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం కాల్వలో మృతదేహం తేలుతూ కొట్టుకరావడంతో స్థానికులు పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. దాంతో ఎస్ఐ మృతదేహన్ని బయటకు తీసి అన్నం ఫౌండేషన్ సభ్యుల సహాయంతో ఖమ్మం మార్చురీకి తరలించారు. మృతదేహం మగ వ్యక్తిగా, బ్లాక్ టీ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రహదారి ప్రమాదంపై కేసు నమోదు

బూర్గంపాడు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాద ఘటనపై ఆదివారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని ముత్యాలమ్మపేటకు చెందిన పగడాల చంద్రారెడ్డి శనివారం తన ద్విచక్ర వాహనంపై పెట్రోలు బంకుకు వెళ్లినట్లు తెలిపారు. పెట్రోలు నింపుకున్న అనంతరం తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో సారపాక ప్రధాన సెంటర్‌లో భద్రాచలం వైపునకు వెళుతున్న లారీ ద్విక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భద్రాచలం తరలించగా వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలించగా ప్రస్తుతం ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి అల్లుడు మధుసూధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బయట మూత.. లోపల కోత

జరిమాన తర్వాత కూడా మాంసం అమ్మకాలు

24మాంసం దుకాణాలకు రూ.32,500 జరిమాన



ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాంసం దుకాణాలను మూసి వేయాలని శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య పత్రికా ప్రకటన, సోషల్ మీడియా ద్వారా విస్త్రతంగా ప్రచారం చేయించారు. అయినా ఖమ్మం నగరంలో కొంతమంది చికెన్, మటన్ వ్యాపారులు దుకాణాల బయట తలుపులు మూసి లోపల మాత్రం యదేశ్చగా మాంసం విక్రయాలు జరిపారు. దీంతో పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య ఆధ్వర్యంలో బృందాలు వీధి వీధిన పర్యటించాయి. మాంసం అమ్మకాలు జరుపుతున్న 24 దుకాణాల యజమానులను గుర్తించి వారికి రూ.32,500 జరిమానా విధించారు. కాగా జరిమాన చెల్లించిన మాంసం వ్యాపారులు తిరిగి అమ్మకాలు జరిపారు. జరిమానాలు విధించే విషయాన్ని కొంతమంది పారిశుధ్య జవాన్లు మాంసం దుకాణాల యజమానులకు చేరవేయటంతో మరో పది దుకాణాల నిర్వాహకులు అప్పటికప్పుడు తాళాలు వేసి తప్పించుకున్నారు.

గురుకుల విద్యార్థి ఆచూకీ లభ్యం

మధిర రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కృష్ణాపురం గ్రామం వద్దగల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న చల్లా మహేష్ అనే విద్యార్థి నాలుగురోజుల క్రితం అదృశ్యమయ్యాడు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ ఆరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విద్యార్థి శనివారం సాయంత్రం వైజాగ్ ఆర్కేబీచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆటోడ్రైవర్ గమనించి ప్రశ్నించాడు. దీంతో అతను తన స్వగ్రామం, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నెంబర్ తెలపడంతో ఆటోడ్రైవర్ అతడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. విద్యార్థి తండ్రి కృష్ణ వైజాగ్ వెళ్లి తన కుమారుడిని ఇంటికి తీసుకువచ్చాడు. దీంతో కళాశాల యాజమాన్యం, వారి తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

రైతుల పట్ల మోదీ సర్కారు వివక్ష

ఖమ్మం మార్కెట్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రైతాంగం పట్ల మోదీ సర్కార్ కక్ష పూరిత వైఖరిని అవలంబిస్తుందని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఆదివారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.


ఆంధ్రజ్యోతి కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న బ్రాంచ్ మేనేజర్ పుల్లారావు

ప్రగతిపథంలో విద్య, వైద్యం

(3వ పేజీ తరువాయి)

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 17 వేల 500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇక 14 ఏళ్లుగా నిరీక్షిస్తున్న ప్రజలకు కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డును అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

సీతారామతో గోదావరి జలాల అనుసంధానం

జిల్లాకు గోదావరి జలాలు రావాలని ప్రజలకు ఉన్న చిరకాల ఆకాంక్ష త్వరలోనే నెరవేరబోతోందని కలెక్టర్ వివరించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని 3 ప్రధాన పంప్‌హౌజ్ పనులు పూర్తి చేసుకొని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నట్లు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కాలువల నిర్మాణం పూర్తయితే సాగర్‌తో సంబంధం లేకుండా గోదావరి జలాల ద్వారా ఖమ్మం రైతులు పంటలు పండించే అవకాశం ఉంటుందన్నారు. రఘునాథపాలెం మండలానికి సాగునీరు అందించేందుకు సుమారు రూ.66 కోట్ల 33 లక్షలతో మంచుకొండ ఎత్తిపోతల పథకానికి ఇటీవల శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మధిర నియోజకవర్గం పరిధిలో కొదుమూరు, వందనం ఫేస్-2, రాయపట్నం, జవహర్ లిఫ్ట్ పనులను రూ.685 కోట్ల 11లక్షలతో చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్నేరు వరదల వేళ ఖమ్మం పట్టణాన్ని పునరుద్ధరించడంలో కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి, అధికారులకు, సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు, సహకరించిన జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య విద్యారంగాల్లో జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు నలువైపులా జాతీయ రహదారులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి

జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధికి నిర్మాణాత్మకమైన రీతిలో సహకారం, సూచనలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా ప్రగతిని ముందుకు నడిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ పోలీస్ సాయుధదళాల గౌరవవందనాన్ని స్వీకరించారు. వేదిక పక్కనే ఉన్న గ్యాలరీలో స్వాతంత్ర్య సమర యోధులను ఆయన సత్కరించారు. ఆ తర్వాత విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. అనంతరం స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునిల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అటవీశాఖ అధికారి విక్రమ్‌సింగ్ రాథోడ్, జడ్పీ సీఈవో దీక్ష రైనా పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో మేయర్ నీరజ నాయకులు, జడ్పీలో సీఈవో దీక్ష రైనా


జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, సీపీ కార్యాలయంలో సీపీ సునీల్‌దత్

జైహింద్

ఘనంగా గణతంత్ర వేడుకలు

జిల్లాల్లో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో రిపబ్లిక్ వేడుకలను నిర్వహించారు. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జెండాను ఆవిష్కరించారు. సీపీ కార్యాలయంలో సీపీ సునిల్‌దత్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీజ జెండా ఆవిష్కరించారు. పోలీసులు ఆయనకు గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ జడ్పీ సీఈవో దీక్ష రైనా ఆవిష్కరించారు. : నెట్‌వర్క్


కామేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో


టీజీవో సంఘం ఆధ్వర్యంలో


టీఎన్జీవో ఆధ్వర్యంలో..


జాతిపిత విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వందన సమర్పణ చేస్తున్న ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్


నేలకొండపల్లిలో తహసీల్దార్..


ఏఎంసీ ఛైర్మన్ వెన్నపూసల..


వ్యవసాయ మార్కెట్లో, రూరల్ మండలంలో, కూసుమంచిలో, బీజేపీ ఆధ్వర్యంలో, వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో..


ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో..


టీడీపీ కార్యాలయంలో...


కృషిభవన్‌లో..


పటేల్ స్టేడియంలో..


50వ డివిజన్‌లో కార్పొరేటర్ రావూరి శరత్‌కుమార్


మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో దయాకర్‌రెడ్డి

విద్యాలయాల్లో వేడుకలు


న్యూవిజన్, చైతన్య, హార్వెస్ట్ పాఠశాలల్లో వేడుకలు


శ్రీనగర్ రెజోనెన్స్, వివేఫీల్డ్, న్యూఇరా పాఠశాలల్లో..


సర్వజ్ఞ, గీతాంజలి, ఎస్‌బీఐటీలో..


44వ డివిజన్‌లో వందన సమర్పణ చేస్తున్న కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంరూరల్, జనవరి26(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెంపులలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలు అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. చదువుకుంటే భవిష్యత్‌లో ఏదైనా సాధించవవచ్చునని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు తుంబూర దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు.ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్,సుబ్బారావు,ఆర్‌ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్ట్ కింద పొన్నెకల్ గ్రామం

కామేపల్లి: అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామం పైలెట్ ప్రాజెక్ కింద ఎంపిక కావడంతో రైతు వేదికలో నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. పొన్నెకల్ పంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు53, రైతుభరోసా258, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా93, రేషన్ కార్డులు 103మంది లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, డీసీసీబి డైరెక్టర్ మేకల మల్లిబాబు, స్పెషల్‌ఆఫీసర్ మదుసుదన్‌రావు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్ కాంగ్రెస్ నాయకులు నల్లమోతు లక్ష్మయ్యగుజ్జర్లపుడి రాంబాబు,డీఎస్, నరిరాం, అశోక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

కూసుమంచి: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామని కూసుమంచి స్పెషలాఫీసర్ శ్రీలత తెలిపారు. మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన ధర్మాతండాలో రైతు భరోసా, ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల, రేషన్‌కార్డుల జారీలో భాగంగా అర్హులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. రైతు భరోసాకు 275మంది, ఆత్మీయభరోసాకు 53మంది, తెల్ల రేషన్‌కార్డులకు 26మందికి మంజూరీకాగా పత్రాలు అందజేశారు. ఇందిరమ్మ గృహాలకు 57 మంది అర్హులను గుర్తించగా 26మందికి రెండోవిడతలో 31మందికి ఇళ్ల మంజూరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో వాణి, ఎంపీవో రామచంద్రరావు, ఏపీవో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


కొంగరలో లబ్ధిదారులకు పథకాల పత్రాలను అందిస్తున్న దయాకర్‌రెడ్డి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఖమ్మంకలెక్టరేట్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగాఆదివారం పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల చిన్నారుల నృత్యాలు అలరించాయి. బీసీ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం విద్యార్థులు నిర్వహించిన దిల్‌దే ఇండియా అంటూ సాగిన దేశభక్తి గేయానికి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీ సునిల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జడ్పీసీ ఈవో దీక్షరైనా పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలి

ఖమ్మం, జనవరి26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి):ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గతప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లస్థలాలను తక్షణమే ప్రస్తుత ప్రభుత్వం కేటాయించాలని కోరుతూ ఖమ్మం అఖిల పక్షం జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ప్రదర్శన నిర్వహించి జడ్పీలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఇళ్లస్థలాలు సాధించే వరకు పోరాటం సాగిస్తామనీ టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, స్తంభాద్రి జర్నలిస్ట్ సొసైటీ అధ్యక్షుడు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందించారు. ఖమ్మం జర్నలిస్టులకు అర్హులైన


నిరసన తెలుపుతున్న జర్నలిస్టు నాయకులు

వారికి ఇళ్లస్థలాలు అందిస్తామని, కలెక్టర్‌కు ఇప్పటికే ఇళ్ల స్థలాలు ఇవ్వమనీ ఆదేశించామన్నారు. తనకు ఇచ్చిన వినతి పత్రాన్ని తుమ్మల పక్కనే ఉన్న కలెక్టర్‌కు అందించారు. ఖమ్మం జర్నరలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

అంబేద్కర్ విగ్రహానికి వినతి

చింతకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో చింతకాని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జనవరి 26వ తేదీన నాలుగు సంక్షేమ పథకాలు అందరికీ అందజేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం మండలంలో ఒకటే గ్రామానికి సంక్షేమ పథకాలు అందజేయడం ప్రజలను మోసం చేసినట్లేనన్నారు. భూటకపు మాటలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, బొడ్డు వెంకటరామారావు, గడ్డం శ్రీను, పొనుగోటి రత్నాకర్, పర్చగాని కొండ, వేముల నర్సయ్య, చాట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వైరాలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



సత్తుపల్లిరూరల్‌లో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రాగమయి



మధిరలో జాతీయ జెండా ఎగురవేస్తున్న న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి



కల్లూరులో జెండా ఎగురవేస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్



ఎర్రుపాలెంలో...

ఘనంగా గణతంత్ర దినోత్సవం

గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం పలు గ్రామాలల్లో, పట్టణాల్లోని పాఠశాలల్లో, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్, మధిర కోర్టులో న్యాయమూర్తి టి. కార్తీక్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాఠశాలల్లో నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ర్యాలీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పెనుబల్లిలో...



కొణిజర్లలో ఇండియా ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



తల్లాడలో గణతంత్ర ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు





వేంసూరులో...



చింతకానిలో...



కారేపల్లిలో...



ఏన్కూర్‌లో...



ముదిగొండలో...

మునిసిపల్ చైర్మన్ జైపాల్‌కు సన్మానం

వైరా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైరా మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములును సన్మానించారు. మునిసిపల్ పాలకవర్గం చివరిరోజున ఉద్యమనాయకులు వారిని సన్మానించారు. గౌతమి బుద్ధుడి చిత్రపటాలను అందజేశారు. సంఘం నాయకులు షేక్.పాషా, ఓర్సు శ్రీనివాసరావు, సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్, మిట్టపల్లి రాఘవరావు, పూర్ణకంటి రామారావు, దరిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

బోనకల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ ఉద్యమకారుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం లభించినందుకు గానూ ఆదివారం బోనకల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ సాధన కొరకు అలుపెరగని పోరాటాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తోటపల్లి చిన సైదులు, జిల్లా నాయకులు తాటికొండ వెంకటరత్నం, కరణం, ప్రకాశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం

వైరా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వైరా శాస్త్రనగర్‌లో భగవాన్ సత్యసాయి సేవసమితి ఆధ్వర్యంలో మూడోరోజు ఆదివారం కూడా దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొని దేవతామూర్తులకు పూజలు చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వీరయ్యచౌదరి, అశోక్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

బోనకల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు ఉంద్రు శ్యాం బాబు, వరలక్ష్మీలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, వైద్యులు రవిచంద్ర, గ్రామ పెద్దలు బొమ్మినేని కొండలరావు, పూర్ణచందర్‌రావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కళాకారుల ప్రచారం

తల్లాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన జరిగే లక్ష డప్పులు, వేలగొంతుల భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం తల్లాడ మండలంలో మాదిగ కళాకారుల రథసారథి పమ్మి రవి ఆధ్వర్యంలో కళాకారులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా నాయకుడు దారెల్లి వెంకటేశ్వర్లు మాదిగ, మండల అధ్యక్షుడు ఎక్కిరాల నాగేశ్వరరావుమాదిగ, ఎక్కిరాల నాగరాజు మాదిగ, వంశీమాదిగ, రమేష్, సుధాకర్, బాబు, రవి పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



లబ్ధిదారురాలికి మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సారథ్యంలో నడుస్తోన్న ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ భరోసా ఇచ్చారు. మండలంలోని పుణ్యపురం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీ, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మంజుఖాన్, తదిరుతుల పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, జనవరి26(ఆంధ్రజ్యోతి): నాలుగు ఇందిరమ్మ సంక్షేమ పథకాలను అదివారం మండల పరిధిలోని కొత్తతండాలో ప్రారంభించారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.రాంబాబు లబ్ధిదారులకు పథకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకార సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీఈవో రవింద్రప్రసాద్, ఈవో బట్టు అశోక్ పాల్గొన్నారు.

చింతకానిలో...

చింతకాని, జనవరి26 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో 4 పథకాలు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విజయరావు, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీవో రామయ్య, ఏవో మానస, నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, బండెల నాగార్జున, తోటకూరి ప్రగతి, సట్టు వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లపాడు గ్రామంలో ఆదివారం సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను మండల ప్రత్యేకాధికారి కడారి విజయభాస్కరరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రీ, గిర్దావర్ లక్ష్మణ్, దుర్గారావు తదితరులున్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, జనవరి26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులదేవరపాడులో ప్రభుత్వం అందిస్తున్న నాలుగు సంక్షేమపథకాలకు సంబంధించిన ధృవపత్రాలను ఆదివారం అందించారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ అలీమ్, తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో గంధం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు, జనవరి26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో సకినాల రమేష్ అన్నారు. ఆదివారం రేపల్లెవాడ గ్రామంలో ప్రజాపాలన లో భాగంగా 4 పథకాలను ప్రారంభించారు. అనంతరం లబ్దిదారలుకు పట్టాలను అందించారు. ఈకార్యక్రమంలో ఏపీఈ వెంకటపతిరాజు, తహసీలద్దర్ శేషగిరిరావు, ఏవో నరసింహారావు, పంచాయతీరాజ్ ఏఈ అనూష, ఎంపీవో జీవీఎస్ నారాయణ పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో...

మధిర రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం చిలుకూరు గ్రామంలో రాష్ట్రప్రభుత్వం నాలుగు పథకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ రాంబాబు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రి పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



కొత్తూరులో లబ్ధిదారుడికి ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి/వేంసూర్/పెనుబల్లి/కల్లూరు/తల్లాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం ఆమె సత్తుపల్లి మండలం కొత్తూరు రైతువేదికలో, వేంసూరు మండలం చిన్నమల్లెల గ్రామంలో, కల్లూరు, తల్లాడ మండలాల పరిధిలోని తూర్పులోకవరం, రెడ్డిగూడెం, పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామాలలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. ఆయా కార్యక్రమాలలో ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, స్పెషల్ ఆఫీసర్ పీ.సునీల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, పసుమర్తి చందర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కల్లూరు ఆర్డీవో వివాదాస్పద వ్యాఖ్యలు

పెనుబల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన గ్రామసభలో కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ మాట్లాడిన తీరు వివాదాస్పదంగా మారింది. ఆదివారం రామచంద్రాపురం గ్రామంలో ప్రజాపాలన సభలో కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ మాట్లాడుతూ 2014నుంచి ఒక్క ఇల్లు, ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మాట్లాడిన తీరు చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకే ఆయన పథకాల తీరుపై మాట్లాడారని వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. అధికారులు తమ విధులను నిర్వర్తించాలే కానీ అధికార పార్టీ ప్రతినిధిగా మాట్లాడటం ఏంటని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి

డాన్‌బోస్కో సంస్థల విశేష కృషి



డాన్‌బోస్కో ఉన్నత పాఠశాలలో ప్రసంగిస్తున్న బిషప్ ప్రకాష్

తల్లాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి డాన్‌బోస్కో విద్యాసంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయని ఆర్‌సీఎం ఖమ్మం బిషప్ పాదర్ సగిలి ప్రకాష్ అన్నారు. ఆదివారం తల్లాడ మండలం పినపాకలోని డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల మహోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ దేశంలోనే కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాస విద్యను డాన్‌బోస్కో సంస్థలు అందిస్తున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన పాటలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాదర్ ప్రదీప్‌రెడ్డి, పాదర్ రాజేష్, రవి, జోసప్, రాజు, విన్సెంట్, శ్రీకాంత్, థామస్, విజయ్ పాల్గొన్నారు.

కల్లూరులో యథేచ్ఛగా మాంసం, చేపల విక్రయాలు



కల్లూరులో మాంసం విక్రయాలు జరుపుతున్న దృశ్యం

కల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని ఎన్‌హెచ్‌ఏఐ రహదారి పక్కన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానికంగా మాంసం, చేపల మార్కెట్లు తెరిచి యథేచ్ఛగా వ్యాపారం సాగించారు. కాగా ప్రభుత్వ అధికార యంత్రాంగం తమకు ఏమీ పట్టనట్లు గా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తుంది. స్థానిక మెయిన్ సెంటర్ బహిరంగంగా మాంసం, చేపల విక్రయాలు చేస్తున్న అధికారుల దృష్టికి రాకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కాని ఒక్క రోజు కూడా నిబంధనలు అమలు చేయడంలో అధికార యంత్రాం గం ఎంత నిర్లక్ష్యం చూపుతుందో అర్థమవుతుంది. ఇకనైన భవిష్యత్‌లో జాతీ య పండుగలకు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రగతిపథంలో విద్య, వైద్యం

(3వ పేజీ తరువాయి)

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 17 వేల 500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇక 14 ఏళ్లుగా నిరీక్షిస్తున్న ప్రజలకు కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డును అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాల అమలులో జిల్లా అగ్రగామిగా ఉందన్నారు.

ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు రావాలని ప్రజలకు ఉన్న చిరకాల ఆకాంక్ష త్వరలోనే నెరవేరబోతోందని కలెక్టర్ వివరించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని 3 ప్రధాన పంప్‌హౌజ్ పనులు పూర్తి చేసుకొని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నట్లు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కాలువల నిర్మాణం పూర్తయితే సాగర్‌తో సంబంధం లేకుండా గోదావరి జలాల ద్వారా ఖమ్మం రైతులు పంటలు పండించే అవకాశం ఉంటుందన్నారు. రఘునాథపాలెం మండలనికి సాగునీరు అందించేందుకు సుమారు రూ.66 కోట్ల 33 లక్షలతో మంచుకొండ ఎత్తిపోతల పథకానికి ఇటీవల శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మధిర నియోజకవర్గం పరిధిలో కొదుమూరు, వందనం ఫేస్-2, రాయపట్నం, జవహర్ లిఫ్ట్ పనులను రూ.685 కోట్ల 11లక్షలతో చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్నేరు వరదల వేళ ఖమ్మం పట్టణాన్ని పునరుద్ధరించడంలో కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి, అధికారులకు, సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు, సహకరించిన జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య విద్యారంగాల్లో జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు నలువైపులా జాతీయ రహదారులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు.



ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి

జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధికి నిర్మాణాత్మకమైన రీతిలో సహకారం, సూచనలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా ప్రగతిని ముందుకు నడిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ పోలీస్ సాయుధదళాల గౌరవవందనాన్ని స్వీకరించారు. వేదిక పక్కనే ఉన్న గ్యాలరీలో స్వాతంత్ర్య సమరయోధులను ఆయన సత్కరించారు. ఆ తర్వాత విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. అనంతరం స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునిల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అటవీశాఖ అధికారి విక్రమ్‌సింగ్ రాథోడ్, జడ్పీ సీఈవో దీక్షరైనా పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.